క్లుప్తంగా

స్వాములకు సద్ది వితరణ



వినుకొండ(నూజెండ్ల): హనుమాన్ నగర్‌లో వేంచేసిన శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో సద్ది వితరణ కార్యక్రమం నిర్వహించారు. గత రెండేళ్లుగా మాలల ధరించిన స్వాములకు సద్ది వితరణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ శోభన్‌బాబు పాల్గొని స్వాములకు సద్ది వితరణ చేశారు. అనంతరం స్వాములకు సద్ది వితరణ చేసిన కనపర్తి వీర వెంకటరావు, ఎండ్లూరి సత్యనారాయణ, లేళ్ల అంజిరెడ్డి, కావూరి నాగేశ్వరరావులను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎస్సీ కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నందు హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో బాలబాలికల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహం అధికారిణి ఎస్.రేణుకమ్మ మాట్లాడుతూ ఆరోగ్యం పరిశుభ్రత ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం టూత్ పేస్టులు, బ్రష్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ ఘంటసాల నవీన్, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, మేడం అశోక్ కుమార్, వెల్లటూరు యేసయ్య, సమాధానం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేత



నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన 17వ బ్యాచ్ డ్రైవర్లకు ఏఇ(ఎం) ఎ.లావణ్య శనివారం సర్టిఫికేట్లు అందజేశారు. ఈసందర్భంగా శిక్షణ పొందిన డ్రైవర్లకు పలు సూచనలు చేస్తూ ఇంధన పొదుపు చేయడం, అలాగే ప్రమాదాలు జరిగే విధానం, అవి జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 18వ బ్యాచ్‌కు అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, ఎల్ఎంవీ ఉన్న డ్రైవర్లు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునేందుకు శిక్షణలో చేరేందుకు ఈ ఫోన్ నంబర్లు 73828 96038, 90527 62796, 73828 96158 సంప్రదించాలని కోరారు. ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్. మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకటేశ్వరునికి అభిషేకాలు



బెల్లంకొండ: కార్తిక మాసం సందర్భంగా శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శని వారం కొండపై నున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భుక్యా గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో అర్చకులు యువకిశోరాచార్యులు పంచామృత అభిషేకాలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలోనూ శనివారం పూజలు ఘనంగా జరిగాయి.

నేడు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలో ఆదివారం రెండు ఆలయాలలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. యాదవుల బజారులో శ్రీకృష్ణ దేవాలయం, ప్రధాన సెంటర్ వద్ద సీతారాముల ఆలయాలలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వ్యవసాయ విద్యార్థుల పర్యటన

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థినులు శనివారం గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామ అధ్యయనం పటం ఆకట్టుకునేలా వేశారు. గ్రామంలోని వనరులు, పంటలు, రోడ్లు తదితరాలను వివరించేలా పటాన్ని ఏర్పాటు చేశారు. టైం ట్రెండ్, టైం లైన్, సమస్య చెట్టు మొదలైన భాగస్వామ్య పద్ధతులను గ్రామస్థుల ద్వారా తెలుసుకొని పటంలో పొందుపరిచారు.

వినుకొండ నియోజకవర్గంలో మద్యం గ్లాసుల గలగలలకు వేళాపాళా అంటూ లేకుండా పోయింది. ఎప్పుడు కావాలనుకున్నా దొరికే వస్తువుల్లో ఇవాళ మద్యం చేరిపోయింది. బెల్టుషాపుల విచ్చలవిడితనం, మనకెందుకులే అనుకునే సిబ్బంది పనితీరు వెరసి 24/7 మద్యం యథేచ్ఛగా మందుబాబులకు అందుబాటులో ఉంటోంది.



అందుబాటులో మద్యం

- రాత్రీ–పగలూ తేడా లేకుండా ఎనీటైం లభ్యం!
- బెల్టుషాపుల్లో కూడా ఎప్పుడైయినా
- చోద్యం చూస్తున్న అధికారులు
- వాచ్‌మెన్ల సాయంతో రాత్రివేళల్లో మద్యం అమ్మకాలు

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యంపాలసీలో నూతన విధానం మద్యం వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఒకవైపు బెల్టుషాపులు, మరోవైపు అక్రమ అమ్మకాలు జరుగుతుండటంతో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. వినుకొండ నియోజకవర్గంలో 19 లైసెన్స్ షాపులతోపాటు ఐదు మండలాలల్లో ఒక్కో మండలానికి 70కిపైగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకంటే 50 రూపాయలు అధికంగా వసూలు చేయడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. టెండర్లలో మద్యం షాపులు దక్కించుకున్న లైసెన్సుదారులు గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బెల్టుషాపులు ఏర్పాటు చేయడం కొసమెరుపు

రాత్రి వేళల్లో అమ్మకాలు

మద్యం దుకాణాలు సమయపాలన లేకుండా 24 గంటలూ అమ్మకాలు జరిగేలా షాపుల యజమానులు అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు కాపాలదారులను ఏర్పాటు చేసుకుని షాపులు మూసివేసినప్పటికీ వాచ్‌మెన్‌ల సహకారంతో ఎక్కువ రేట్లకు మద్యం అమ్ముతూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఇక గ్రామాల్లో అమ్మకాలు 24 గంటలూ ప్రజలకు మద్యం అందుబాటులో ఉండటంతో మందు బాబులకు ఎక్కడపడితే అక్కడ మద్యం, అందుబాటులోకి తెచ్చారు. దీంతో మద్యం బాబుల జేబులకు చిల్లు పెడుతూ యజమానులు మాత్రం కాసులువేట కొనసాగిస్తున్నారు.

ఒకవైపు ప్రభుత్వం, ఉన్నతాధికారులు అక్రమ అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని బెల్టుషాపులు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నప్పటికీ స్థానికంగా అధికారుల ఆదేశాలు ఎక్కడా అమలు కావటంలేదు. టీడీపీ నాయకుల అండదండలు మద్యం వ్యాపారులకు మెండుగా ఉండటంతోపాటు కొన్నిచోట్ల టీడీపీ నాయకులే మద్యం వ్యాపారం చేస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మద్యం వ్యాపారానికి కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రొంపిచర్లలో సీపీఎం ప్రజాపోరు ప్రచార యాత్ర

ధరాభారాలపై కరపత్రాలు పంపిణీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

రొంపిచర్ల: కేంద్రంలో వరుసగా 3వసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తోందని సీపీఎం రొంపిచర్ల మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరాజు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం నిర్వహించిన ప్రజాపోరు ప్రచార యాత్రలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అధిక ధరలను నియంత్రించి, నిత్యావసర ధరలను అందుబాటులోకి తీసుకురావాలని, విద్యుత్ ట్రూ ఆప్ చార్జీల రద్దు, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయం ఉపసంహరణ, విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రం రొంపిచర్లలో ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరి ప్రజలపై విపరీతమైన నిత్యావసర ధరాభారం మోపుతోందన్నారు. ట్రూఅప్ పేరిట రూ. 18 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ చార్జీలను ఎందుకు పెంచారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 14 వరకు ఇంటింటా ప్రచారం నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

12న జాబ్ మేళా

వినుకొండ(నూజెండ్ల): డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్‌ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీరావు తెలిపారు. జాబ్‌మేళాకు సుమారు 3 కంపెనీలు పాల్గొంటాయని, 10, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బిటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదువుకున్న అభ్యర్థులు పాల్గొనాలని సూచించారు. 18 నుంచి 40 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు బయోడేటా, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫోటోలతో ఉదయం 9గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9951214919, 9100566581 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా గ్రామదేవతల వార్షికోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ, అద్దంకమ్మ, మహాలక్ష్మమ్మ, గంగమ్మ, పెద్దమ్మ, కనకమ్మ దేవాలయాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ సభ్యుల సారథ్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు మహిళలు అమ్మవార్లను దర్శించుకొని పొంగళ్ళు పొంగించి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన సంతర్పణ నిర్వహించారు.

మిరపలో ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించాలి

ప్రకృతి వ్యవసాయ స్టేట్ రీసోర్స్ పర్సన్ రామచంద్రన్, జిల్లా శిక్షకుడు టి. సైదయ్య



రైతులకు సూచనలు చేస్తున్న రామచంద్రన్, సైదయ్య

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో ప్రకృతి వ్యవసాయ రైతు నాశన ఏడుకొండలు వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ స్టేట్ రీసోర్స్ పర్సన్ రామచంద్రన్, జిల్లా శిక్షకుడు టి. సైదయ్య ముఖ్యఅతిథులు పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంట వేసే ప్రతి రైతు ఎకరాకు 400 కేజీల ఘనజీవామృతం వేయడం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి జరుగుతుందని, తద్వారా మొక్కలకు అన్ని రకాల పోషకాలు అందుబాటులోకి రావడంతో పాటు భూమి సారవంతమవుతుందన్నారు. ప్రధాన పంటతో పాటు అంతర పంటలుగా ఉల్లి, బంతి, ముల్లంగి, కొత్తిమీర ప్రతి రెండు మిరప మొక్కల తర్వాత మార్చిమార్చి వేసుకోవడం ద్వారా మిరప పంటను ఆశించే రైతులకు అపార నష్టం కలిగించే నల్ల తామర పురుగు ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా పెట్టుబడులు, ఖర్చులు తగ్గుతాయని రైతు ఆర్థికంగా బలోపేతం అవుతాడని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి డివిజన్ ఎంటీ తిరుపతిరావు, భాస్కరరావు, ప్రకాశరరావు, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

అమరావతి: సీపీఎం కార్యకర్త నండూరి వెంకటేశ్వరరాజుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన ఎండ్రాయి గ్రామంలో ప్రజా సమస్యలపై పనిచేసే వెంకటేశ్వరరాజుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గోరంట్ల నాగమల్లేశ్వరరావు రాజు, ఆయన కుమారుడు శివనాగేశ్వర్ రాజు, బావమరిది వరప్రసాద్‌లు దాడి చేసినా ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు.

నాలుగురోజుల్లో ఫొటో ఓటరు సారాంశ సవరణ

ప్రత్యేక పోలింగ్ క్యాంపెయిన్ సెంటర్లను సందర్శించిన కమిషనర్



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికార్లు ఇచ్చిన ఆదేశాల మేరకు పురపాలక పరిధిలో ఏర్పాటుచేసిన ఫొటో ఎలక్ట్రోరల్ ప్రత్యేక సారాంశ సవరణ ప్రత్యేక క్యాంపెయిన్ పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి (ఏయిఆర్‌వో) ఎం.జస్వంతరావు శనివారం పరిశీలించారు. నియోజకవర్గంలో 2025 జనవరి ఒకటవ తేదీన నిర్వహించే ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ సారాంశంలో భాగంగా ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక క్యాంపెయిన్ కేంద్రాలను పోలింగ్ కేంద్రాల సెంటర్లలో ఏర్పాటు చేశారు. మున్సిపల్ హైస్కూలు, హర్షు హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన క్యాంపెయిన్ సెంటర్లను సందర్శించి బూత్‌లెవెల్ అధికారులకు పలు సూచనలు చేశారు.

14 నుంచి ఇంటింటి సర్వే

రాజుపాలెం : క్యాన్సర్ నిర్మూలనకు ఈ నెల 14 వ తేదీ నుంచి ఇంటింటి సర్వే నిర్వహించేందుకు ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు శనివారం శిక్షణ కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. డాక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఉన్న అనుమానితులను గుర్తించాలన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనుమానితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలన్నారు. సర్వేలో రోజుకు గ్రామంలో 20 ఇళ్లు పూర్తి చేయాలని సూచించారు.

రెండు చోట్ల త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



కంటెపూడి సమీపంలో పడిపోయిన వాహనం

సత్తెనపల్లి: ప్రమాదాలలో ప్రాణాపాయం త్రుటిలో తప్పింది. సత్తెనపల్లి రూరల్ మండలంలో శనివారం ఇవి చోటుచేసుకున్నాయి. సత్తెనపల్లి మండలం కంటెపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాల వద్ద కారు, బొలెరో వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బొలెరో పూర్తిగా పడిపోగా, కారు ముందు భాగం దెబ్బతింది. ఇరువురికి స్వల్ప గాయాలు కావడంతో వెంటనే వైద్యశాలకు తరలించారు. – అలాగే సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల నుంచి ముప్పాళ్ళ మండలం తొండపికి ప్రయాణికులతో వెళుతున్న ఆటో తిరగడటంతో డ్రైవర్ తలకు గాయాలయ్యాయి. డ్రైవర్‌ను ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.



కంటెపూడి సమీపంలో దెబ్బతిన్న కారు ముందుభాగం

అన్నీ బలవంతపు అరెస్టులే

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- రెండేళ్లనాటి కేసులో ఇప్పుడు అరెస్టులు, వేధింపులా?
- సబ్‌జైలులో రిమాండ్ ఖైదీల పరామర్శ
- వెంటనే అక్రమ అరెస్టులు నిలిపివేయాలంటూ డిమాండ్



సబ్‌జైలు బయట బాధితుల బంధువులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ అరెస్టులు వెంటనే నిలిపివేయాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సబ్ జైలును సందర్శించి అందులో ఉన్న రావిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ఆన్‌లైన్ రిపోర్టర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా జైలు బయట మీడియాతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం రావిపాడు గ్రామంలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని, అతని వద్ద లేఖలో కొనతం రామకోటేశ్వరావు, నాగేశ్వరావు అనే వ్యక్తుల పేర్లు రాశాడని, ఆ లేఖ ఎవరు రాశారో తెలియకపోయినా రామకోటేశ్వరరావు, అతని తల్లి, నాగేశ్వరావు, వెంకటేష్‌లను శుక్రవారం అక్రమంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. రెండేళ్ల క్రితం ఆత్మహత్య జరిగితే పోలీసులు అప్పటి నుంచి ఎటువంటి యాక్షన్ తీసుకోలేదని, ఆ లేఖ ఎవరు రాశారో తెలుసుకోవడానికి పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపితే వారు తమకు ఎటువంటి ఆధారాలు దొరకలేదని, ఇంకా మృతుడు రాసిన పుస్తకాలు ఏమైనా ఉంటే పంపించమని కోరారన్నారు. మృతుడు లేఖ రాశాడని రుజువు కానప్పటికీ కేవలం వీళ్ళిద్దరి పేర్లు లేఖలో ఉన్నాయనే కారణంతో రెండేళ్ల తర్వాత అరెస్ట్ చేసి జైలు పంపించడం జరిగిందన్నారు.

ఇదే గ్రామంలో నాలుగు నెలల నుంచి కోటేశ్వరరావు ఇంటిపై ప్రతిరోజు దాడులు చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని, కంప్లైంట్ ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు పోలీసు తీసుకోలేదన్నారు. అరెస్టు చేసిన వారిని చూడటానికి వచ్చిన కుటుంబ సభ్యులను స్టేషన్ ముందే ప్రత్యర్థులు బండ బూతులు తిడుతుంటే, పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారే తప్ప, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

81 మందిలో 61 మంది వైఎస్సార్ సీపీ వారే

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీపై దారుణంగా వ్యవహరిస్తున్నారనడానికి ఉదాహరణగా ఈ సబ్ జైలే నిదర్శనమన్నారు. దీనిలో 81 మంది ఖైదీలు ఉంటే వారిలో 60 మంది వైఎస్సార్ సీపీకి చెందినవారు ఉన్నారన్నారు. అదేవిధంగా ప్రతి జైలులో ఉన్న ఖైదీల వివరాలు తీసుకుంటే ఈ నాలుగైదు నెలలు కాలం నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలేనని చెప్పారు. పార్టీ కార్యకర్తలను చిత్రహింసలు పెట్టి జైలుకు పంపించే కార్యక్రమం ప్రభుత్వం కొనసాగిస్తున్నదన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగం ప్రకారం ఏదీ జరగట్లేదని, కేవలం లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. టీడీపీ వారు పోలీసులను బెదిరించి గతంలో పెట్టిన కేసులు తిరగదోడి వైఎస్సార్‌సీపీ వారి మీద కేసులు పెట్టిస్తూ, వారందరినీ జైళ్లకు పంపించే కార్యక్రమం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ ఎస్పీ మంచి అధికారి!

కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు చాలా మంచి అధికారి అని, అలాంటి ఎస్పీని సోషల్ మీడియా కార్యకర్తని రిమాండ్‌కు పంపలేదనే కారణంతో బదిలీ చేశారన్నారు. కర్నూలు జిల్లాలో 20 మంది సీఐ, ఎస్సైలను ట్రాన్స్‌ఫర్ చేశారని, కేవలం సోషల్ మీడియా కేసులు పెట్టడం లేదనే కారణంతో పోలీసులను వారి ఉద్యోగాలు చేయనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. గతంలో తమ ప్రభుత్వంలో ఇటువంటి అరెస్టులు జరగలేదని చెప్పారు. నియోజకవర్గంలో అక్రమ కేసులు పెట్టడం, పాత కేసులు తిరగతోడటం, అన్యాయంగా అరెస్టులు చేయడం దారుణమైన విషయమని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, షేక్ ఖాజావలి మాస్టారు, పొదిలే ఖాజా, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, గంటినపాటి గాబ్రియేలు, పాలపర్తి వెంకటేశ్వరరావు, మనోహర్‌యాదవ్, మూరే రవీంద్ర రెడ్డి, పచ్చవ రవీంద్రబాబు పాల్గొన్నారు.

నరసరావుపేటలో సేవా కార్యక్రమాలు



ప్రభుత్వాసుపత్రికి వీల్‌ఛైర్‌ను అందజేస్తున్న ఏఎంరెడ్డి కళాశాల చైర్మన్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణ, పరిసర గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏరియా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు ఉపయోగించే వీల్‌ఛైర్‌ను అందజేశారు. పట్టణ పరిధిలోని హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. అనాథాశ్రమం, వృద్ధాశ్రమంలో దుప్పట్లు, దుస్తులు పంపిణీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్యంపై ప్రజలకు కల్పించారు. అలాగే అంధుల పాఠశాల, వృద్ధాశ్రమం, అనాధ శ్రమం, కోటప్పకొండ రెడ్ల అన్నదానం సత్రంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జునరావు, డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో గోతులను పూడ్చండి

ప్రజాసంఘాల నాయకులు డిమాండ్



రహదారిపై ఏర్పడిన గోతుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: గోతుల మయంగా మారిన బైపాస్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇస్సప్పాలెం–జొన్నలగడ్డ బైపాస్‌రోడ్డును శనివారం ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, పౌరహక్కుల సంఘం నాయకుడు చికినం చిన్నా, బీసీ సంఘం నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. గోతుల మయంగా మారిన రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. బైపాస్‌రోడ్డు కావడంతో భారీ వాహనాలు ఈ రోడ్డులో అధికంగా రవాణా సాగిస్తుంటాయని తెలిపారు. భారీ గోతులు నుంచి ప్రయాణించడం వారికి కష్టంగా మారిందన్నారు. లోడ్ లారీలు గోతుల్లోనే నిలిచిపోయే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. బైపాస్ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి వాహనాల రాకపోకలు సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ కంటిచూపు కాపాడుకోవాలి

ఐవిజన్ హాస్పిటల్ డాక్టర్ రామలింగారెడ్డి



డాక్టర్లు చెంచిరెడ్డి, శాంతిశ్రీలను సన్మానిస్తున్న పాత్రికేయులు

నరసరావుపేట: సర్వేంద్రియానం నయనం ప్రధానమని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పెద్దచెరువులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో శనివారం పల్నాడు జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మాక్సి ఐ విజన్ హాస్పిటల్ సౌజన్యంతో పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటిచూపు పరీక్షలు నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ నాయకులు నల్లపాటి రాము, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ నాగోతు ప్రకాష్ వేర్వేరుగా హాజరై కంటి పరీక్షలు చేసిన ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్లు చెంచిరెడ్డి, శాంతిశ్రీలను అభినందించారు. ఈసందర్భంగా వారిని పాత్రికేయులు దుశ్శాలువతో సన్మానించారు. సుమారు 70మంది పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు అందుకున్నారు.




కల్యాణం.. కమనీయం...

పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో గల శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తీక మాసం శ్రావణా నక్షత్ర సందర్భంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కనుల పండుగగా నిర్వహించారు. అదేవిధంగా 15 రంగులతో కలిగిన 8 గంటల పుష్పయాగం భారీ స్థాయిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు యాగంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి భారీ అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసుల శ్రావణ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అమృత కృష్ణ సుబ్బారావు, ట్రెజరర్ కాళ్ల రామకోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)